క్లుప్తంగా

ఆర్థిక సహాయం అందజేత



కామారెడ్డి టౌన్: మెదక్ జిల్లాకు చెందిన క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్(సీఆర్‌పీ) రమేష్, శ్రీనివాస్‌లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కామారెడ్డి జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మృతుల కుటుంబ సభ్యులకు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. రూ.12 వేల చొప్పున వారికి అందజేశారు. రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో వారిని అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ కోరారు. నాయకులు రాజు, సంతోష్‌రెడ్డి, రాములు, సూర్యపాల్, సాయిరెడ్డి తదితరులున్నారు.

గోశాలకు రూ.లక్ష విరాళం



పిట్లం(జుక్కల్): బిచ్కుంద మండల కేంద్రంలోని సోమాయప్ప స్వామీజీ గోశాలకు పిట్లంకు చెందిన డాక్టర్ అచ్యుతం బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గోశాల ప్రతినిధులు మాట్లాడుతూ.. బిచ్కుందలో ఏర్పాటు చేసిన గోశాలలో 500పైన ఆవులు ఉన్నాయని అన్నారు. గోశాలకు విరాళం అందించిన డాక్టర్ అచ్యుతంకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

రాజంపేట: అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని రాజంపేట ఎస్సై పుష్పరాజ్ హెచ్చరించారు. ఎల్లాపూర్ తండా నుంచి తెచ్చి అక్రమంగా నిలువ చేసిన ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ల యజమానులు, టిప్పర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. బుధవారం సంబంధిత వ్యక్తులను తహసీల్దార్ అనిల్‌కుమార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త!



పిట్లం(జుక్కల్): రూంతండాలో సైబర్ నేరాలపై బుధవారం ఏఎస్సై రాచప్ప, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీ బ్యాంక్ వివరాలు, ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. అనవసరపు లింకులు ఓపెన్ చెయ్యవద్దన్నారు. పోలీస్ సిబ్బంది రవిచంద్ర, నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలం పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): మోతె గ్రామ శివారులో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల భవన సముదాయం నిర్మాణం కోసం బుధవారం స్థలాన్ని ఆర్డీవో ప్రభాకర్ పరిశీలించారు. గ్రామ శివారులోని సర్వే నంబర్–164లో 20 ఎకరాల భూమిని ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కోసం స్థలం ఎంపిక చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. ఆయన వెంట తహసీల్దార్ నరేందర్‌గౌడ్, గ్రామ పెద్దలు ఉన్నారు.

విద్యుత్ మరమ్మతులు..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ మల్లన్నగుట్ట వద్ద మిషన్ భగీరథలో జరుగుతున్న ఎలక్ట్రిక్ పనులను బుధవారం విద్యుత్ శాఖ డీఈ కళ్యాణ్ చక్రవర్తి పరిశీలించారు. భగీరథ ప్లాంట్‌లో విద్యుత్ హెచ్చుతగ్గులను పరిశీలించారు. భగీరథకు విద్యుత్ అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఏఈ గంగాధర్, ఏఎల్ఎం మోబ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాన్ని విజయవంతం చేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కల్వరాల్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7న నిర్వహించే వజ్రోత్సవాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో కోరారు. ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్ రెడ్డి పూర్వ విద్యార్థులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. కమిటీ అధ్యక్షుడు గంగారెడ్డి, ప్రధానకార్యదర్శి బాల్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తాగునీటి కష్టాలు

- మధ్యాహ్న భోజనానికి నీటి కటకట
- ఇంటి నుంచి తెచ్చుకుంటున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



సిర్‌పూర్ పాఠశాలలో..



మద్నూర్‌లో ఇంటి నుంచి నీళ్ల బాటిళ్లను తెచ్చుకుని భోజనం చేస్తున్న విద్యార్థినులు

మద్నూర్(జుక్కల్): వేసవికాలం ఇప్పుడిప్పుడే మొదలవుతోంది. తాగునీటి కోసం విద్యార్థులు, మధ్యాహ్న భోజనం వండే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీటి వసతి లేకపోవడంతో వారికి కష్టాలు తప్పడం లేదు. పాఠశాల సమీపంలోని చేతి పంపులు, ఇళ్లను ఆశ్రయిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా భోజనం చేస్తున్న విద్యార్థులకు నీటి వసతి కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు ఇళ్ల నుంచే బాటిళ్లలో నీరు తెచ్చుకుంటున్నారు. డోంగ్లీ, మద్నూర్ మండలంలోని ఖరగ్, సుల్తాన్‌పేట్, మద్నూర్, సిర్‌పూర్, చిన్న టాక్లీ, సోనాల, తడిహిప్పర్గ తదితర గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తాగునీటికి తంటాలు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు బాటిళ్లలో నీళ్లు తెచ్చుకొని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. నివాస ప్రాంతాలకు దూరంగా పాఠశాల ఉన్న విద్యార్థులు బరువైన పుస్తకాల బ్యాగులతో పాటు, నీటి బాటిళ్లను మోసుకెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. భోజన వసతి ఏర్పాటు చేసిన ప్రభుత్వం నీటి వసతి కూడా సమకూర్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన జలమణి పథకం అటకెక్కింది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఇళ్ల నుంచే తెచ్చుకుంటున్నాం



పాఠశాలల్లో నీటి వసతి లేకపోవడం వల్ల ప్రతి రోజు ఇళ్ల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నాం. పాఠశాల బ్యాగును మోయడానికి ఇబ్బంది పడుతుంటే నీళ్ల బాటిల్‌ను కూడా మోయడం అదనపు భారమైంది. అధికారులు స్పందించాలి.

– అశోక్, మద్నూర్

మా దృష్టికి రాలేదు

తాగునీటి సమస్య మా దృష్టికి రాలేదు. తాగునీటి సమస్య ఉన్న పాఠశాలల గురించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. పాఠశాలల్లో బోర్లు వేయించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– రాములు, మండల విద్యాధికారి

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



గోపాల్‌పేటలోని పరీక్షాకేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు



తాడ్వాయిలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు



గాంధారిలో హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు..



మాచారెడ్డిలో తనిఖీలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల ప్రారంభానికి ముందు విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నాగిరెడ్డిపేటలో 15 మంది విద్యార్థులు, తాడ్వాయిలో ఒకరు, గాంధారిలో ఆరుగురు. లింగంపేటలో 10, దోమకొండలో ఆరుగురు, భిక్కనూరులో ముగ్గురు, నిజాంసాగర్‌లో 12 మంది, బీబీపేటలో ఐదుగురు, మద్నూర్‌లో నలుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు.



సదాశివనగర్‌లో తనిఖీలు చేస్తున్న అధ్యాపకులు



ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తనిఖీలు



లింగంపేట పరీక్ష కేంద్రం వద్ద..



మద్నూర్ పరీక్ష కేంద్రం వద్ద..

సస్యరక్షణ చర్యలు పాటించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతులు పంటల సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ప్రజాపతి సూచించారు. బుధవారం అడ్లూర్ ఎల్లారెడ్డిలో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వాతావరణ పరిస్థితుల కారణంగా వరిలో అగ్గి తెగులు, కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఉందన్నారు. నివారణకు రైతులు ట్రైసైక్లోజోల్ 75 శాతం, 0.6 లేదా కాసుగామైసిన్ 3 శాతం ఎస్ఎల్ 2.5 మిల్లీ లీటర్ కలిపి పిచికారీ చేయాలన్నారు. మొగి పురుగు నివారణకు ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు, 4 కిలోలను 20 కిలోల ఇసుకలో కలిపి పొలంలో చల్లాన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



మద్నూర్(జుక్కల్): జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు బిచ్కుంద సీఐ నరేష్ పేర్కొన్నారు. మండల కేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారిని బుధవారం పోలీస్, రవాణా, రెవెన్యూ, జాతీయ రహదారి శాఖల అధికారులు పరిశీలించారు. ఎక్కువ సార్లు ప్రమాదాలు జరుగుతున్న పాయింట్లను వారు పరిశీలించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని సీఐ పేర్కొన్నారు. రవాణాశాఖ అధికారిణి రజిని, తహసీల్దార్ ముజీబ్, ఎస్సై విజయ్‌కొండ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి



ఎల్లారెడ్డి: ప్రజలు శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడారు. ఎస్సై మహేష్, ఆర్ఏఎఫ్ బలగాల సిబ్బంది, తదితరులున్నారు.

ధర్మసభను విజయవంతం చేయాలి



ఎల్లారెడ్డిరూరల్: వీరశైవలింగాయత్‌ల ధర్మసభను విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి వీరశైవలింగాయత్ సంఘం అధ్యక్షుడు వీరప్ప పిలుపునిచ్చారు. వీరశైవ లింగాయత్‌ల మహాపాద యాత్రకు సంఘం సభ్యులు బుధవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 3న నిజామాబాద్ జిల్లా సుంకిని నుంచి వీరశైవలింగాయత్‌ల మహాపాదయాత్ర ప్రారంభమైందని ఈనెల 12న కొలనుపాకకు చేరుతుందన్నారు. సంఘం నాయకులు నీలకంఠం, సంఘమేశ్వరప్ప, హనుమంతప్ప తదితరులున్నారు.

బీజేపీ విజయంపై హర్షం

కామారెడ్డి టౌన్: మెదక్ – కరీంనగర్ – ఆదిలాబాద్ – నిజామాబాద్ పట్టభద్రుల స్థానం ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించడంపై ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలను గెలిపించడం ద్వారా ప్రజలు బీజేపీవైపు ఉన్నారన్న విషయం స్పష్టమైందని పేర్కొన్నారు. రాబోయే అన్ని ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ధ్రువపత్రాలను దగ్గర ఉంచుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): వాహనదారులు తమ వద్ద తప్పకుండా ధ్రువపత్రాలను ఉంచుకోవాలని ఎస్సై మహేందర్ అన్నారు. బుధవారం బేగంపూర్ చౌరస్తా 161 జాతీయ రహదారిపై వాహనాలను ఎస్సై తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది సాయిశివ, అంజి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యత

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



దోమకొండలో యాదవ సంఘం కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దోమకొండ: గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తాను ఆలయాల అభివృద్ధికి సహకరిస్తున్నానని, నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నానని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం దోమకొండ మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మల్లికార్జునస్వామి ఆలయం వద్ద నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సదర్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన వనదుర్గ పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణం ప్రహరీ, సీసీ పనుల ప్రారంభోత్సవం చేసి మాట్లాడారు. ఆలయాల నిర్మాణం సమాజ సేవ చేయడం రెండూ ముఖ్యమన్నారు. యాదవ సంఘం ప్రతినిధులతో పాటు ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చింతల రాజేష్, జగదీష్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఆలయ అభివృద్ధి



దోమకొండ: అందరి సహకారంతో ఆలయ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చాముండేశ్వరి దేవాలయ కమిటీ అధ్యక్షుడు సిద్దారెడ్డి అన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆలయ కమిటీ తరపున ఆలయంలో చేసిన పనులు, భక్తుల విరాళాలు, చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు నార్ల వెంకటేశం, ఎల్లం, రమేష్, ఈవో ప్రభు, మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, మాజీ సర్పంచ్ నల్లపు శ్రీను, నాయకులు అనంతరెడ్డి, నర్సారెడ్డి, శంకర్‌రెడ్డి, బొమ్మెర శ్రీను, కమిటీ మాజీ అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



కామారెడ్డి టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్ఎం) ద్వారా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్లకు జీవో–60 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని ఏఐటీయూసీ, కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. కనీస వేతనం అమలు కోసం ఈ నెల 6న హైదరాబాద్‌లో హెల్త్ డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నట్లు యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దశరథ్ తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు, ఉద్యోగులు అఖిల్, బాలు, సాగర్, తదితరులున్నారు.

సమస్యలు తలెత్తకుండా చూడండి

- ఏఎంసీ చైర్‌పర్సన్ మంత్రి అంజవ్వ



హాజరైన పాలకవర్గ సభ్యులు

బాన్సువాడ: యాసంగి పంట కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని బాన్సువాడ ఏఎంసీ చైర్‌పర్సన్ మంత్రి అంజవ్వ గణేష్ అన్నారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో పాలకవర్గం మొదటి సమావేశం నిర్వహించారు. ముందుగా ఆదాయం, ఖర్చుల వివరాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే నెలలో యాసంగి పంట వచ్చే అవకాశం ఉన్నందున రైతులకు కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. గన్నీ సంచుల కొరత లేకుండా చూడాలని అన్నారు. రైతులకు అవసరముంటే టార్పాలిన్లు ఇవ్వాలని సూచించారు. ఏఎంసీ కార్యదర్శి నరేందర్, డైరెక్టర్లు లింగాల గంగారెడ్డి, సంగ్రాం నాయక్ తదితరులున్నారు.

కూలీల హాజరు శాతం పెంచాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను మరింత పెంచాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో 50 మందికి తగ్గకుండా కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. వందశాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని సూచించారు.

ప్రణాళిక ప్రకారం చదవాలి



తాడ్వాయి(తాడ్వాయి): విద్యార్థులు ప్రణాళిక ప్రకారం క్రమశిక్షణతో చదువాలని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్, యాంకర్ రమేష్ అన్నారు. తాడ్వాయి బాలికల గురుకుల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మోటివేషనల్ క్లాసులు బోధించారు. ప్రతి ఒక్క విద్యార్థి కాలయాపన చేయకుండా చదువుపై ధ్యాస పెట్టాలని సూచించారు. క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని చదువుకోవాలన్నారు. ప్రధాన ఉపాధ్యాయులు సురేఖ, కల్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలి



మాచారెడ్డి: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేవిధంగా పాఠాలు బోధించాలని మాచారెడ్డి విద్యాధికారి దేవేందర్ రావు సూచించారు. బుధవారం చుక్కాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతులను పరిశీలించారు. అలాగే విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాన్‌సింగ్, ఉపాధ్యాయులు సీఆర్పీ నరేష్ ఉన్నారు.

అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ల అనుసంధానం



కామారెడ్డి అర్బన్: వేసవిలో పట్టణంలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం అదనంగా మూడు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను వంద కేవీఏ నుంచి 160 కేవీఏకు అభివృద్ధి చేశామని ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. బుధవారం పనులు పూర్తయిన ట్రాన్స్‌ఫార్మర్లను అనుసంధానం చేశారు. డీఈ కల్యాణ చక్రవర్తి, ఏడీఈ కిరణ్ చైతన్య, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

మొక్కలు ఎండిపోకుండా కాపాడాలి

బాన్సువాడ రూరల్: సోమేశ్వర్‌లో బుధవారం బాన్సువాడ ఎంపీవో సత్యనారాయణరెడ్డి పర్యటించారు. నర్సరీని పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తగా కాపాడాలని పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు. పలు సూచనలు చేశారు.

రాజంపేటలో చలివేంద్రం ఏర్పాటు

రాజంపేట: మండల కేంద్రంలో బుధవారం సింగిల్‌విండో వైస్ చైర్మన్, మాజీ ఎంపీటీసీ ఆమిదాల రమేష్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నియామకం

భిక్కనూరు: కామారెడ్డి ఆర్టీఐ ప్రొటెక్షన్ కమిటీ జిల్లా న్యాయ సలహాదారుడిగా భిక్కనూరుకు చెందిన న్యాయవాది బల్ల శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం ఆర్టీఐ రాష్ట్ర డైరెక్టర్ సలీం నియమాక పత్రాన్ని అందజేశారు. కమిటీ జిల్లా ప్రతినిధులు షబానా బేగం, జమున, ఆస్మా తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆధార్ సేవలు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట తపాలా కార్యాలయంలో బుధవారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించినట్లు సబ్ పోస్ట్ మాస్టర్ సూర్య తెలిపారు. ఆధార్ సేవలు 12వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): ముంబోజిపేట, ముంబోజిపేట తండా, లింగంపేట, రాంపూర్, భవానిపేట, మాలోత్ సంగ్యానాయక్ తండా గ్రామాల్లో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టినట్లు ఎంపీవో మలహరి తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

హెచ్ఐవీపై కళాజాత ప్రదర్శన

దోమకొండ: మండల కేంద్రంతో పాటు ముత్యంపేటలో బుధవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వైఆర్‌జీకేర్ లింకు వర్కర్ స్కీం ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. హెచ్ఐవీ వ్యాప్తి, నివారణ జాగ్రత్తలు గురించి కళాబృందం సభ్యులు తమ పాటల రూపంలో అవగాహన కల్పించారు. గ్రామ కార్యదర్శి యాదగిరి, ఐసీటీసీ కౌన్సెలర్ మ్యాక నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, లింకు వర్కర్ స్కీం సూపర్‌వైజర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఎల్లారెడ్డి: అన్నాసాగర్‌లో అన్నాసాగర్ తండాకు చెందిన కేతావత్ లలితకు కాంగ్రెస్ నాయకులు బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. ఆమెకు రూ.19 వేల చెక్కు మంజూరు కావడంతో చెక్కును అందజేసినట్లు తెలిపారు.

గుండెపోటుతో తెలంగాణ ఉద్యమ నేత మృతి

మాచారెడ్డి: తెలంగాణ ఉద్యమ నేత, జిల్లా కో–ఆప్షన్ మాజీ సభ్యుడు ముస్తాక్ హుస్సేన్ బుధవారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందారు. పాల్వంచ మండలం ఎలుపుగొండ గ్రామానికి చెందిన ముస్తాక్ హుస్సేన్ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయనను జిల్లా కో ఆప్షన్ సభ్యుడిగా నియమించింది. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, హుస్సేన్ కుటుంబసభ్యులను ఓదార్చారు. సంతాపం తెలిపారు.